

తిరుపతికి చేరుకున్న సిట్ బృందం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

ఎన్నికల పోలింగ్ సందర్భంగా తిరుపతి జిల్లాలో చోటు చేసుకున్న అల్లర్లు ఘటనలపై విచారణ చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన సిట్ బందం శనివారం రాత్రి తిరుపతికి చేరుకోనుంది. ఆదివారం నుంచి ఇటీవల చోటు చేసుకున్న ఘటనలపై ఈ బందం విచారణను చేపట్టనుంది. ఈనెల 13వ తేదీ ఎన్నికల పోలింగ్ రోజు రాత్రి తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ రామ్‌రెడ్డిగారిపల్లి పంచాయతీ కూచువారుపల్లిలో చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై, సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడి చోటు జరిగింది. ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల రోజు సాక్షాత్తు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తిరుపతి ఆర్డీఓ కార్యాలయం ఎదుటే చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, అతని తనయుడు వారి అనుచరులపై రాళ్ల వర్షం కురిసిన విషయం విధితమే. ఎన్నికల పోలింగ్ అనంతరం ఈనెల 14వ తేదీ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద వైసిపి నాయకులు టిడిపి కూటమి అభ్యర్థి పులివర్తి నాని, అతని గన్ మెన్లపై హత్యాయత్నం జరిగింది. ఈ గొడవల్లోనే వైసీపీకి చెందిన పలువురుపై కూడా దాడి జరిగి గాయాలయ్యాయి. పరిస్థితి మరింత తీవ్రంగా మారడంతో మహిళా వర్సిటీ పరిసరాలు లోని ప్రజలు భయాందోళనకు గురి అయ్యారు. ఇంత జరుగుతున్న పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారని భావించిన కేంద్ర ఎన్నికల సంఘం అందుకు బాధ్యులు చేస్తూ తిరుపతి జిల్లా ఎస్పీ కష్ణకాంత్ పటేల్, వెస్ట్ డిఎస్పి సురేంద్ర రెడ్డి, మరో ముగ్గురు సీఐలుపై బదిలీ వేటు వేసింది. ఎస్పి, డిఎస్పిలపై శాఖపరమైన విచారణ చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో, ఈ అల్లర్లపై విచారణ చేసేందుకు సిట్ బందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బందం శనివారం రాత్రి తిరుపతికి చేరుకొని, శ్రీ పద్మావతి అతిధి గహంలో బస చేయనున్నారు. ఆదవారి నుంచి ఈ బందం విచారణ చేపట్టినట్లు సమాచారం.

తిరుపతికి చేరుకున్న సిట్ బృందం

సిట్ బృందానికి నేతృత్వం వహిస్తున్న డీఎస్పీ రవిమనోహర్ ఆచారి, సీఐ ప్రభాకర్ రెడ్డి, రామ్‌రెడ్డి పల్లి పంచాయతీ, శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ స్ట్రాంగ్ రూమ్ ప్రాంగణం, చంద్రగిరి ఆర్వో, తిరుపతి ఆర్డీవో కార్యాలయం పరిసరాల్లో ఘటన జరిగిన తీరు తదితర అంశాలపై సీసీ టీవీలో రికార్డు అయిన దృశ్యాలను, సిట్ బృందానికి తిరుపతి పోలీసులు అందజేశారు.

బోర్డు ఒకచోట..
కౌంటర్ మరోచోట..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అధికారులు చెప్పేదానికి చేసేదానికి ఎటువంటి పొంతన ఉండదు. పారదర్శకంగా ఉన్నట్లు పైకి చెబుతున్నా లోపల మాత్రం మరేదో దాగి ఉంటుంది. అందుకు రూ.200ల ప్రత్యేక దర్శనం కౌంటరే ఉదాహరణ. ఓంకార స్వామి మఠం వద్ద పిఆర్ఓ కార్యాలయాన్ని, రూ.200ల ప్రత్యేక దర్శనం కౌంటర్ను దేవస్థానం అధికారులు ఇటీవల ఏర్పాటు చేశారు. అయితే పిఆర్ఓ కార్యాలయాన్ని అక్కడే ఉంచి రూ.200ల టికెట్ కౌంటర్‌ను మాత్రం ధూర్జటి గ్రంథాలయం వద్దకు మార్పు చేశారు. పిఆర్ఓ కార్యాలయానికి వచ్చిన భక్తులు అక్కడే 200 రూపాయల టికెట్ కొనుగోలు చేసి ప్రత్యేక దర్శనానికి వెళ్లేవారు. ప్రముఖులైతే పిఆర్ఓ కార్యాలయ సిబ్బంది కూడా వెళ్లేవారు. టికెట్ కౌంటర్‌ను ఎత్తివేయడంతో పిఆర్ఓ కార్యాలయం సిబ్బంది మాత్రమే భక్తులతో వెళుతున్నారు. టికెట్లు మాత్రం కొనుగోలు చేయడం లేదు. దీంతో ఆలయానికి ఆదాయం రావడం లేదు. ఈ ఆదాయం కొందరు దళారుల జేబుల్లోకి వెళుతోంది. టికెట్ కౌంటర్ కూడా పిఆర్ఓ కార్యాలయంలోనే ఉంటే భక్తులు అక్కడే టికెట్ కొనుగోలు చేసి దర్శనానికి వెళ్లేవారు. దళారుల సంక్షేమం కోసం దేవస్థానం అధికారులు ఈ గొప్ప నిర్ణయం తీసుకున్నట్లుగా విమర్శలు వస్తున్నాయి.

తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్ రాజు

కేంద్ర ఎన్నికల సంఘం చొరవతో నియామకం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్ రాజు నియమితులయ్యారు. కేంద్ర సర్వీసులో ఉన్న ఈయనను కేంద్ర ఎన్నికల సంఘం స్వయంగా స్పందించి నియమించింది. తిరుపతి జిల్లాలో సాధారణ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల చివరిరోజు చంద్రగిరి నియోజకవర్గంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద, టిడిపి కూటమి అభ్యర్థి పులివర్తి నాని అనుచరులు, వైసీపీ ప్రస్తుత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వారి అనుచరులపై నడిరోడ్డుపై రాళ్లతో దాడి చేశారు. పోలింగ్ రోజు రాత్రి చంద్రగిరి నియోజకవర్గ రామిరెడ్డిపల్లి పంచాయితీ కూచువారుపల్లిలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, ఆ పంచాయతీ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డిపై టిడిపి వర్గాలు దాడులు చేసి, ఒక కారును దగ్ధం చేసి, మరో కారును ధ్వంసం చేశారు. సర్పంచి ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడులు చేసి ఇల్లును పూర్తిగా మంటలకి ఆహుతి చేశారు. దీనిపై కక్ష పెంచుకున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వద్దనున్న స్ట్రాంగ్ రూమ్ ఎదుట టిడిపి అభ్యర్థి పులివర్తనాన్ని అతని గన్‌మెన్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డారు. బీరు బాటిల్లు ఇనుప రాడ్లు, క్రికెట్ బ్యాట్లు స్టిక్కులతో మహిళా వర్సిటీ ప్రాంగణంలో వీరంగం సష్టించారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకోవడంతో గొడవ మరింత ముదిరి, వరుసటి ప్రాంగణం మొత్తం బీభత్సంగా మారింది. ఇంత జరుగుతున్న గొడవను అరికట్టాల్సిన పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారని, పైగా గొడవలను కవర్ చేసేందుకు వచ్చిన మీడియాపై లాటీలు చిలిపించారు. తిరుపతిలో జరిగిన అల్లర్లు, విధ్వంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం సీరియస్ అయింది. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, డిజిపి లను రాష్ట్రంలో జరిగిన అల్లర్లపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలకు కారణాలను ఎన్నికల సంఘానికి వివరించింది. తిరుపతి అల్లర్లపై వధా సైనిక వ్యవహరించిన జిల్లా ఎస్పీ కష్ణకాంత్ పటేల్, తిరుపతి డిఎస్పి సురేందర్ రెడ్డిలను బదిలీ చేసి, వారిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించిన విషయం విధితమే. ఎన్నికల ఈసీ ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ కష్ణ కాంత్ పటేల్‌ను బదిలీ చేసింది. బదిలీ అయిన కష్ణకాంత పటేల్ స్థానంలో హెచ్.హర్షవర్ధన్ రాజులు నియమిస్తూ రాష్ట్ర డిజిపి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. హర్షవర్ధన్ రాజు గతంలో విజయవాడ డిసిపిగా పనిచేశారు. తర్వాత అన్నమయ్య జిల్లా ఎస్పీగా పని చేశారు. అనంతరం సిఐడి ఎస్పీగా పని చేస్తున్నారు. ప్రస్తుతం బీహార్ ఎన్నికల అబ్జర్వర్‌గా కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. సమర్థవంతమైన ఎస్పీగా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించి తిరుపతి జిల్లాకు హర్షవర్ధన్ రాజును నియమించింది. ఒకటి రెండు రోజుల్లో ఈయన బాధితులు తీసుకొనున్నట్లు సమాచారం.

పనులు వేగవంతం చేయండి : కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం స్థానంలో నూతనంగా నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను కమిషనర్ అదితి సింగ్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా కాంట్రాక్టర్లకు, ఏఈకామ్ ప్రతినిధులకు, ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ సమన్వయంతో పనులు వేగవంతం చేసి భవన నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఈ భవనం పూర్తి అయితే మునిసిపల్ కార్పొరేషన్‌కి నూతన కార్యలయం రావడమే కాకుండా, కమాండ్ కంట్రోల్ సేవలు కూడా ప్రజలకి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పనులు ఆలస్యంపై స్పందిస్తూ ఇకపై ఎప్పటికప్పుడు నిర్మాణ పనుల వివరాలను తనకు తెలియజేస్తూ పూర్తి స్థాయిలో నివేదిక ఇస్తూ వుండాలని ఆదేశించారు. స్లాబ్ వర్కులన్ని పూర్తి చేసి, ఏ ఫ్లోర్‌కి ఆ ఫ్లోర్లలో చేపట్టాల్సిన పనులను పూర్తి చేసుకుంటూ రావాలన్నారు. ఇకపై పనులు ఆలస్యమయితే తగుచర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రక్టర్లు, డిఈ విజయ కుమార్ రెడ్డి, ఏయికామ్ ప్రతినిధి అనీల్ తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అదితి సింగ్

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అంతా కట్టుదిట్టం

ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

ఈవిఎం, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్‌లు భద్రపరచిన శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను శనివారం తిరుపతి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యారికేడింగ్ తదితర అంశాలపై సిబ్బందికి తగిన సూచనలు సలహాలు, ఆదేశాలు జారీ చేశారు. సెక్యూరిటీ వద్ద సంబంధిత సందర్శకుల రిజిష్టర్‌లో కలెక్టర్ సంతకాలు చేశారు. అనంతరం కలెక్టర్ స్ట్రాంగ్ రూము పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులకు సూచించారు. బ్యారికేడింగ్ ఏర్పాట్లు పటిష్టంగా ఏర్పాటుతో, సీసీ కెమెరాల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని, తగినంత సిబ్బందిని సంబంధిత రిటర్నింగ్ అధికారులు విధులు కేటాయించి పర్యవేక్షించాలని ఆదేశించారు. మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూము వద్ద భద్రత ఏర్పాట్లు 11వ తేదీ నుండి 200 మీటర్లు నుండి రాష్ట్ర పోలీస్ బలగాలు, 100 మీటర్లలో రాష్ట్ర సాయుధ బలగాలు, స్ట్రాంగ్ రూము వద్ద సిఎపిఎఫ్ ఏర్పాటు చేసి భద్రత ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. పోలింగ్ నాడు, మరుసటి దినం జరిగిన సంఘటనల నేపథ్యంలో ఐదంచెల భద్రత ఏర్పాట్లు చేశామని, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎంట్రన్స్, రోడ్ పాయింట్ వద్ద నుండి సరైన ధ్రువపత్రాలు ఉంటేనే పంపుతున్నారని తెలిపారు. జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. 6 గార్డ్ పాయింట్‌లు స్ట్రాంగ్ రూము పరిధిలో ఏర్పాటు చేసి నిరంతర గస్తీ నిఘా ఉంటుందని తెలిపారు. సిఎపీఎఫ్, రాష్ట్ర సాయుధ బలగాలు, సివిల్ పోలీసులు కలిపి సుమారు 160మంది పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందనీ తెలిపారు. యూనివర్సిటీ కాంపౌండ్‌లో స్ట్రాంగ్ రూం వద్ద కట్టుదిట్టమైన 3 లేయర్ బ్యారికేడింగ్ ఏర్పాటు చేశామని, తిరుపతి పార్లమెంటరీ, 7 అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూములలో ఈవిఎంల భద్రతపై, అలాగే పరిసర ప్రాంతాల నిఘా కొరకు స్ట్రాంగ్ రూం పరిసరాల చుట్టూ నాలుగు దిక్కులా సుమారు 96 సీసీ కెమెరాల ఏర్పాటుతో స్ట్రాంగ్ రూమ్‌ల పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఎన్నికల పోటీ అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించేందుకు వీలుగా ఏర్పాటు చేశామని అన్నారు. ఈవిఎంలు, వివిప్యాట్‌ల భద్రత అంశంలో ఎలాంటి సందేహాలు, అపోహాలు అవసరం లేదని అత్యంత పారదర్శకంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. నూతన ఎస్పీ విధుల్లో చేరాక సెక్షన్ 144 అమలు ఎన్ని రోజులు కొనసాగించాలని, ఇతర భద్రత అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని తగుచర్యలు తీసుకుని సురక్షిత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కాలంలో పలు ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక సంఘటనలపై అధనపు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ హింసాత్మక ఘటనలకు సంబంధించి ఏదైనా సంఘటనకు స్పందించే క్రమంలో ప్రజలు, మీడియా, సంయమనం పాటించడం అత్యంత కీలకమన్నారు. ఈ విషయంలో ప్రతిఒక్కరూ బాధ్యతతో వ్యహరించాలని, ఇటువంటి సంఘటనలు జరిగిన సందర్భంలో సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. ఎలాంటి కల్పితాలు, ఫేక్ న్యూస్ ప్రచారం జరగకుండా చూడాలని కోరారు. ఏదైనా సందేహాలుంటే జిల్లా ఎన్నికల అధికారికి, జిల్లా ఎస్పీలను సంప్రదించి వివరణ తీసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంట అదనపు ఎస్పీ శ్రీనివాస రావు, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, చంద్రగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్ కుమార్, పోలీస్ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇట్టయితే ఎట్టుంటాది..!!

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి:

మావా.. రా మావా.. నీ కోసమే ఎదురు సూస్తా ఉండాను. ఎలచ్చన్లో నువ్వ జెప్పింది నేను ఇన్నా.. ఈ యాళ నేను జెప్పింది నువ్వ ఇనాల అంతే. యాం లేదు మావా.. జగనన్న సీఎం అయ్యి, కాళాస్త్రిలో మధుసూదన్ రెడ్డి ఎమ్మెల్యే అయితే ఓకే.. అట్టగాకుండా సెంద్రబాబు సీఎం అయ్యి, సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే అయితే ఓకే.. అదీగాకుండా ఏరే ఇదంగా అయితే...? అదే మావా జగనన్న సీఎం అయ్యి ఇక్కడ సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే అయితే, ఇంకాగాకుండా అక్కడ సెంద్రబాబు సీఎం అయ్యి ఇక్కడ మధుసూదన్ రెడ్డి ఎమ్మెల్యే అయితే ఎట్టుంటాది అనేది నా బుర్రలో ఆలోశన. ఎండకి తిరిగితే బుర్ర గిర్రని తిరగతా ఉండ్ల. ఆ మాదిర్తో రాతిరి నుంచి ఇదే తిరగతా ఉండాది. సీకటితోనే ఇంటి కాడికి ఒచ్చినా. మీ మావ వాకింగ్‌కి పొయ్యినాడని మాయత్త జెప్పింది. సరే యాడికి బొయ్యినా సద్దికూడు తాగేసి ఒస్తావని సావిట్లో కూసోనుండా. నేను జెప్పింది అయ్యేదానికి శాన్సు ఉండాదా.. లేదా.. కరెట్టా.. కాదా.. సెప్పు మావా. ఉండాదంటావు, లేదంటావు, జరగతాదంటావు, జరగదంటావు యాంది మావా. వాకింగ్‌కి పోతే పిచ్చికుక్కేమన్నా కరిసిందా... లేకపోతే ఎండకి తలకాయ తిరగతా ఉండాదా.. మాయత్త యామన్న అనిందా. అవును నిజమే మావా.. నువ్వ జెప్పింది గూడ ఆలోసించాల. చేసినోడిని ఒదిలేసి... చూసినోడిని ఒదిలేసి... చెప్పినోడిని ఒదిలేసి.. ఊ కొట్టినోడిని ఒదిలేసి.. ఈ మెసేజి సదివినోళ్ళ పైన కచ్చ పెంచుకుంటారు. మనోళ్లు సెప్పుడు మాట్లు బాగ ఇంటారు. రిజల్సు ఎట్టుండినా నేను జెప్పింది కరెట్ అని జెప్పినావు నాకు శానా ఇదిగా ఉండాది మావా ఇట్టయితే ఎట్టుంటాది.. ఇట్టయితే ఎట్టుంటాది..!!

ఆధ్యాత్మిక కేంద్రంలో అరాచకాలు

- విశ్వవిద్యాలయంలో విధ్వంసం
- బూర్జువ రాజకీయ కుట్రలకు తిరుపతి వేదిక

ప్రజాశక్తి- తిరుపతి సిటి:

తిరుపతి అంటే ప్రపంచ వ్యాప్తంగా పరిచయం లేని ఊరు. ఆధ్యాత్మిక, విద్యా కేంద్రంగా విరాజిల్లుతుంది. ఇలాంటి ప్రసిద్ధిగాంచిన నగరాన్ని బూర్జువ రాజకీయ పార్టీలు తమ కుట్రలకు వేదికగా చేసుకోంటోంది. ఆధ్యాత్మిక కేంద్రంలో అరాచకాలకు తెరలేపారు. ప్రపంచంలోనే ఎక్కడాలేని విధంగా 8 విశ్వవిద్యాలయాలతో వెలుగుతున్న తిరుపతిలో రాజకీయ విధ్వంసానికి పూనుకోవడం శోచనీయం. రాజకీయాల్లో గెలుపు ఓటములు సర్వసాధారణం. కానీ కక్షలు, కుట్రలు సరైనవి కావు. గత వారం రోజులుగా తిరుపతి వాసులు భయాందోళనతో కాలం గడుపుతుండడం గమనార్హం.

పద్మావతి మహిళా వర్సిటీ ప్రాంగణంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ (ఫైల్ ఫోటో)

శ్రీవెంకటేశ్వరస్వామి కొలువై ఉన్న జిల్లా తిరుపతి. ఇక్కడికి ప్రతిరోజు దేశవిదేశాల నుంచి లక్షమందికిపైగా యాత్రికులు రాకపోకలు సాగిస్తుంటారు. సెలవు రోజుల్లో అయితే మరో 20 నుంచి 30 వేల మంది అదనంగా వస్తుంటారు. ప్రస్తుతం వేసవి సెలువు నడుస్తున్నాయి. మే 13న రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో విహార యాత్రలు తగ్గాయి. పొలింగ్ తర్వాత తిరుపతి సందర్శనకు యాత్రికుల తాకిడి పెరుగుతుందని అందరు భావించారు. కానీ పోలింగ్ రోజు రాత్రి నుంచి జిల్లాలో జరిగిన విధ్వంసాలతో యాత్రికుల మాట అటుంచితే జిల్లా వాసులే భయాందోళనలో ఉన్నారు. పోలింగ్ రోజు ఒక పార్టీ ఏజెంట్ ప్రత్యార్థి పార్టీ నాయకులు కొట్టడం, నాయకులపై, కార్యకర్తలపై దౌర్జన్యాలకు దిగడంతో పాటు అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండు రెచ్చగొట్టే ధోరణికి దిగాయి. చంద్రగిరి నియోజకవర్గంలో ప్రారంభమైన గొడవ చిలికిచిలికి గాలివానగా మారి. విశ్వవిద్యాలయాల్లో విధ్వంసం సృష్టించే స్థాయికి చేరింది. పోలింగ్ రోజు సోమవారం జిల్లాలో అర్ధరాత్రి వరకు కొన్నిచోట్ల పోలింగ్ జరిగింది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పలు కేంద్రాలను పరిశీలించారు. రామిరెడ్డిగారిపల్లి వద్ద వైఎస్‌పి ఏజెంట్‌పై టిడిపి కూటమి నాయకులు దాడికి పాల్పడడంతో గొడవ ప్రారంభమైంది. ఇరుపార్టీల నాయకుల రెచ్చగొట్టే దోరణితో వ్యవహరించారు. అదే రోజు సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత వైసిపి సర్పంచి చంద్రశేఖర్‌పై కూటమి నాయకులు దాడి చేశారు. అతని ఇంటిపై రాళ్లతో, కర్రలు, రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న వైసిపి అభ్యర్థి గాయపడిన వారిని పరామర్శించేందుకు వస్తుంటే టిడిపి కూటమి నాయకులు నడిరోడ్డుపై అతన్ని అడ్డగించి దాడికి పాల్పడ్డాడు. టిడిపి అభ్యర్థి కళ్లముందే వైసిపి అభ్యర్థి కారును దగ్ధం చేశారు. మరో కారును ధ్వంసం చేశారు. అతనిపై దాడికి పాల్పడితే నలుగురు గన్‌మేన్ల భద్రతతో అక్కడ నుంచి తప్పించుకున్నారు. దీంతో అధికార పక్షం కక్ష పెంచుకున్నట్లు ఉంది. పోలింగ్ మరుసటిరోజు మంగళవారం ఈవిఎంలన్ని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచే సమయంలో పోటీలోని అభ్యర్థులు రావడం సహజం. ఈ నేపథ్యంలో మహిళా వర్శిటీకి టిడిపి అభ్యర్థి తన అనుచరులతో చేరుకున్నారు. అదే సమయంలో అక్కడే ఉన్న అధికార పార్టీ నాయకుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఉన్నట్టుండి అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు గొడవలకు దిగారు. టిడిపి అభ్యర్థి కారుపై వైసిపి నాయకులు దాడి చేశారు. కారును ధ్వంసం చేశారు. అభ్యర్థిపై దాడికి ప్రయత్నిస్తే అతను గన్‌మెన్ అడ్డుకోవడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. అంతటితో గొడవ అగలేదు. ఇరుపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని బీరుబాటిళ్లు, రాడ్లు, కత్తులు, కర్రలు, సుత్తులతో కొట్టుకుంటూ బీభత్సం సృష్టించారు. భద్రత కేంద్రమైన స్ట్రాంగ్ వద్దే ఇంత జరుగుతున్న పోలీసులు నిమ్మకుండడం గమనార్హం. వర్శిటీ నుంచి ఒకరిపై మరోక్కొరు దాడులు చేసుకుంటూ పరుగులు తీశారు. దీంతో మహిళా వర్శిటీ సమీప ప్రాంతాల్లో సైతం ప్రజలు, షాపులు మూసివేసి, ఇళ్లకు తలుపులువేసి దాంకోవాల్సిన పరిస్థితి దాపురించింది. అంతా జరిగాక తీరిగ్గా పోలీసులు తమ బలగాలతో వర్శిటికి చేరుకున్నారు. రావడమే తమ ప్రతాపాన్ని చూపించారు. వర్శిటీ ప్రాంగాణంలో ఉన్న సిబ్బంది, స్థానికులు, ఆఖరికి మీడియాపై లాఠీలు ఝులిపించారు. సాయంత్రానికి కలెక్టర్, ఎస్పి అక్కడికి చేరుకుని పరిస్థితులను సమీక్షించి, జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ ప్రకటించారు. ఘటనపై విచారణ చేపడుతాం. కారుకులను శిక్షిస్తామంటూ పేర్కొన్నారు. బూర్జువ పార్టీలకు చెందిన నాయకులు మాత్రం తమ గాయాలకు చికిత్స తీసుకున్నారు. కానీ ఇరుపక్కాల దెబ్బలతిన్న కార్యకర్తలు, అభిమానులు ఇళ్లకు వెళ్లి ఎవ్వరికి చెప్పకోలేక బాధలను అనుభవించారు. స్థానికులు, ఉద్యోగులు, తమపై జరిగిన దాడికి ఇరుపార్టీల వారిని తిట్టుకోవడం తప్పా ఏమిచేయలేక పోయారు. జర్నలిస్టుల మాత్రం వారిపై జరిగిన దాడిని ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం శూన్యం. మునుపెన్నడు లేని విధంగా విశ్వవిద్యాలయాల్లో సీసాలు, కర్రలు, రాడ్లు, సుత్తులు, బ్యాట్లు, క్రికెట్ స్టికలతో దాడులు చేయడం, వాహనాలను పెట్రోల్ పోసి తగలపెట్టడం, దొరికిన వారిని దొరికినట్లు చావబాదడం శోచనీయం. ఇలాంటి విషసంస్కృతిని విశ్వవిద్యాలయాల్లోకి తీసుకురావడం దారుణం. రాజకీయ ప్రత్యర్థులు తమ ఎత్తులకుపై ఎత్తులు ఓటర్లను మెప్పించేందుకు, ప్రజలను నమ్మించేందుకు చేయాలే తప్పా, పెత్తనం కోసం, ఎదుటివారిపై చేయి సాధించేందుకు దాడులకు దిగడం సరైనది కాదు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం, పాత సినిమాల్లో లాగా అంత అయ్యిపోయాక చివర్లో రావడం, లాఠీలకు పని చెప్పడం విమర్శలకు తావిస్తోంది. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి, నగరంలో శాంతిభద్రతలను అదుపులో ఉంచి, ప్రజలకు భరోసా ఇచ్చి, భద్రత కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా 'దృష్టి'

చర్చిలో పోలీసుల తనిఖీలు బాధాకరం

-పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభుదాస్

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని అరుంధతి పాలెం చర్చిలో గంజాయి ఉందని అను మానం పేరుతో పోలీసులు ప్రవర్తించిన తీరును ఖండిస్తున్నామని గూడూరు పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభుదాస్ పేర్కొన్నారు. గూడూరు టిడిపి కార్యా లయంలో పాస్టర్స్ అండ్ లీడర్స్ అసోసియేషన్ సభ్యులు, టిడిపి క్రిస్టియన్ సెల్ నాయకులు శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభు దాస్ మాట్లాడుతూ గూడూరు అరుంధతి పాలెంలో అనేక సంవత్సరాలుగా చర్చిని ఏర్పా టు చేసి ప్రార్థనలు నిర్వహిస్తున్నామని శుక్రవారం గంజాయి ఉందని అనుమానంతో పోలీసులు చర్చిని దౌర్జన్యంగా ఓపెన్ చేయించి తనిఖీలు చేయడాన్ని ఖండిస్తున్నామని దీన్ని వ్యతిరేకిస్తూ చేపట్టే నిరసనకు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఇజ్రాయిల్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న వీఆర్వో

విఆర్వో చర్యతో ఆగిపోయిన అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): మంగళం పరిధిలోని తిరుపతి నగరపాలక సంస్థ విలీన గ్రామం శెట్టిపల్లి చెరువులో అక్రమ నిర్మాణ పనులను స్థానిక వీఆర్వో భూపతి ఆచారి అడ్డుకున్నారు. శనివారం శెట్టిపల్లి గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 119 లో కొందరు చెరువు భూభాగాన్ని జెసిబి యంత్రాలతో చదును చేస్తూ గది నిర్మాణానికి పునాదులు వేస్తుండగా వీఆర్వో భూపతి ఆచారి అడ్డుకుని చెరువుకు సంబంధించిన భూభాగంలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో అక్రమ నిర్మాణ దారులు అక్కడి నుండి వెళ్లిపోయారు.

'ఫ్యామిలీ డాక్టర్'కు విశేష స్పందన

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మడలంలోని కామ్ పాలెం గ్రామంలో శనివారం ఉదయం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంకు విశేష స్పందన లభించింది. డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో గర్భిణులందరిని సమావేశ పరిచి వారికి అందే వైద్య సదుపాయాలు, ప్రభుత్వ పథకాల గురించి ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేషులు వివరించారు. గర్భవతి 12 వారాల లోపు తమ పేరును ఏఎన్ఎం ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, ప్రతి గర్భిణి రెండు సూదులు వేసుకోవాలని ప్రతినెలా హిమోగ్లోబిన్ పరీక్షలు చేసుకోవాలని నాలుగో నెల నుండి ఐరన్ మాత్రలు రోజూ ఒకటి చొప్పున కాన్పు అయ్యే లోపు 180 మాత్రలు మింగాలని దీంతో పాటు కాల్షియం , విటమిన్ మాత్రలు తీసుకోవాలని తెలిపారు. మొదటి కాన్పు వారు వారి బ్యాంక్ అకౌంట్ నెంబరు, ఆధార్ కార్డు ఏఎన్ఎం వద్ద ఇస్తే వారికి ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా వారికి మూడు విడతలుగా ఐదు వేల రూపాయలు రూపాయలు వారి అకౌంట్లో జమ చేస్తారని తెలిపారు. రెండవ కాన్పులో ఆడబిడ్డగాని పుడితే వారికి ఒకేసారి ఐదువేల రూపాయలు జమ అవుతాయన్నారు.

21న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 21న మంగళవారం ఉదయం 10.30 గంటలకు అధ్యక్షులు ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి నిర్వహిస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, సింగిల్ విండో అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

చేనేత హస్తకళ మేళా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి– కరకంబాడి మార్గంలోని వి ఆర్ ఆర్ కళ్యాణమండపంలో శనివారం సంస్కృతి కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేత, హస్తకళల మేళాను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ సెక్రటరీ మహేష్ పైడి మాట్లాడుతూ ఈ మినీ మేళాలో వివిధ రాష్ట్రాలకు చెందిన 35 మంది కళాకారులు తమ ఉత్పత్తులను అమ్మకాలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా జైపూర్ కి చెందిన బెడ్ షీట్స్, గృహాలంకరణ వస్తువులు, కలంకారి చీరలు, బెంగాలీ కాటన్ సారీస్, కాంత వర్క్ సారీస్, భాగల్పూర్ డ్రెస్ మెటీరియల్స్ అండ్ సారీస్, మన రాష్ట్రానికి చెందిన కొండపల్లి బొమ్మలు, కడపకి చెందిన చేనేత టవల్స్, కాది షర్ట్స్ ఖాదీ టాప్ , హైదరాబాద్ కి చెందిన హ్యాండ్బ్లాక్ ప్రింటెడ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉంచామన్నారు. తిరుపతి నగర ప్రజలు ఈ చేనేత హస్తకళల మేళా ద్వారా నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చన్నారు.

పింఛను ఆపేశారు..!

వృద్ధురాలి ఆవేదన

ప్రజాశక్తి - సత్యవేడు: రెండున్నర సంవత్సరాలుగా తనకు పింఛను ఆపేశారని సత్యవేడు మండలం మధనంజేరి గ్రామానికి చెందిన వృద్ధురాలు పద్మావతి సిఐటియు నాయకుల ముందు ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త కుప్పయ్య రెండున్నర సంవత్స రాల క్రితం మృతి మృతి చెందాడని, అంతకుముందు సజావుగా ఇస్తున్న వృద్ధాప్య పింఛను తన భర్త చనిపోయినప్పటి నుండి ఆపేశారని తెలిపారు. వృద్ధాప్య వయసులో ఎలాంటి ఆదరణ లేని తనకు వృద్ధాప్య పింఛను ఇచ్చి సహాయ సహకారాలు అందించాల్సిన ప్రభుత్వ అధికారులు తన పింఛను ఆపివేయడం చాలా బాధకలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై అనేకమార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించుకున్నా తన సమస్యను పరిష్కరించకుండా మొహం చాటేస్తున్నారని తెలిపింది. అనర్హులకు పెన్షన్లు ఇచ్చే ఈ అధికారులు అర్హురాలైన తనకు ఎందుకు పింఛన్ ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తన పక్షాన నిలబడి అధికారులతో మాట్లాడి తనకు పెన్షన్ ఇప్పించేలా సహాయం చేయాలని సత్యవేడు మండల సిఐటియు కార్యదర్శి మెలగు రమేష్‌కి తన అభ్యర్థనను తెలిపింది.

పింఛను ఆపివేయడం అన్యాయం

ఈ సందర్భంగా మెలగు రమేష్ మాట్లాడుతూ వృద్ధురాలైన పద్మావతమ్మకు పింఛన్లు రాకుండా ఆపేయడం చాలా బాధాకరమని, సహాయ సహకారాలు అందించాల్సిన ప్రభుత్వ అధికారులు ఆమెకు పెన్షన్ ఇప్పించకుండా వారి ఆఫీసుల చుట్టూ తిప్పించుకోవడం తగదన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఆమెకు పెన్షన్ వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడి ఆమెకు న్యాయం చేసే వరకు తన సహాయ సహకారాలు అందిస్తానని వృద్ధురాలైన పద్మావతి హామీ ఇచ్చారు.

ఎవరి ధీమా వారిదే..!

- వెంకటగిరి మున్సిపాల్టీ ఓట్ల పైనే అందరి చూపు
- ఇరు పార్టీ శ్రేణుల్లోనూ పెరుగుతున్న కలవరం

నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కురుగొండ్ల రామకృష్ణ

ప్రజాశక్తి - డక్కిలి: వెంకటగిరి నియోజకవర్గంలో ఇరు పార్టీల్లోనూ గెలుపుపై ఎవరి ధీమాలో వారు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వైసిపి అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మొదటిసారి గెలవు సాధించేందుకు, టిడిపి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ మూడోసారి గెలిచేందుకు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. నియోజక వర్గంలో ఒకప్పుడు టిడిపి గెలుపు నల్లేరు మీద నడకే అన్న రీతిలో ఉండేది. నియోజక వర్గాల పునర్విభజన తర్వాత 2009 నుండి అప్పట్లో కాంగ్రెస్ ప్రభావం ఉన్న కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలు వెంకటగిరిలో విలీనం కావడంతో ఇరు పార్టీలు 'నువ్వా నేనా?' అన్నట్లు పరిస్థితి మారిపోయింది. 2019 ఎన్నికల్లో నియోజక వర్గంలోని కలువాయి , రాపూరు , సైదాపురం డక్కిలి, బాలాయపల్లి , వెంకటగిరి రూరల్ , వెంకటగిరి మున్సిపాల్టీలలో వైసీపీ ఆధిక్యతను చాటి నియోజక వర్గంలో ఇప్పటి వరకు నమోదు కానీ 38,720 ఓట్ల మెజారిటీ సాధించింది. కానీ ఈ సారి ఎన్నికల్లో ఆ రకమైన వాతావరణం లేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు. టిడిపి డక్కిలి , బాలాయపల్లి, వెంకటగిరి రూరల్ మండలంలో ఆ పార్టీయే మెజారిటీ సాధిస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల్లో వైసిపికి అత్యధిక మెజార్టీ వస్తుందని మండలాలలో గతంలో కొనసాగిన ఈ దఫా కూడా ఆ మెజారిటీ కాస్త తగ్గినా, మెజార్టీ మాత్రం వైసీపీదే నని ప్రచారం వినిపిస్తోంది. వైసిపి మెజారిటీ తగ్గించడంలో రాపూరు మండలంలో బలమైన వర్గం కలిగిన చెన్ను తిరుపాల్ రెడ్డి , బాలాయపల్లి మండలంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ సింగంశెట్టి భాస్కరరావు, డక్కిలి మండలంలో మండల ఉపాధ్యక్షుడు గడ్డం సుధీర్ రెడ్డి వర్గీయుల చేరికలు టిడిపి ప్రోత్సాహంతో ముందుకు సాగారు. దీంతో డక్కిలి బాలాయపల్లి, వెంకటగిరి రూరల్ మండలాల్లో టిడిపి ఆధిక్యత ప్రదర్శిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాల్టీ పైనే ఇరు వర్గాల చూపు

వెంకటగిరి పట్టణంపై ప్రస్తుతం ఇరు పార్టీల గెలుపు ఓటములు ఆధారపడి ఉన్నట్లు తెలుస్తోంది. 2009, 2014 ఎన్నికల్లో టిడిపి విజయానికి వెంకటగిరి మున్సిపాల్టీ పరిధి లోని ఓటర్లే బాటలు వేశారు. 2014లో మాత్రం వైసిపి పట్ట మొ గ్గ చూపి 2800 ఓట్ల ఆధిక్యతను ఇచ్చారు. చేనేత కుటుంబాలకు చెందిన ఓటర్లు ఎక్కువగా ఉన్న మున్సిపాల్టీ పరిధిలో ఈ ఐదేళ్లలో నేతన్న నేస్తం ద్వారా పొందిన లబ్ధి, వైసిపి పోల్ మేనేజ్మెంట్ ల కారణంగా పట్టణ ఓటర్లు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి అండగా నిలిచారని ప్రచారం కూడా సాగుతోంది, ఎగ్జిట్ పోల్స్, ఇంటిలిజెన్స్ సమాచారాల మేరకు గెలుపుతో ఎవరు దీమాలో వారు ఉన్నారని, ఏ పార్టీ విజయం సాధించిన మెజారిటీ స్వల్పంగానే ఉంటుంది ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు

ముగ్గురు చిన్నారులకు మంత్రి నివాళి

బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ

చిన్నారుల తల్లిని ఓదార్చుతున్నమంత్రి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఎస్‌బిఆర్ పురంలో రెండు రోజుల క్రితం ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారుల మృతితో ఎస్‌బిఆర్ పురం శోక సంద్రంలో మునిగి పోయింది. ఈ విషయం తెలిసిన మంత్రి రోజా చిన్నారుల మృతదేహాలకు శనివారం నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వడమాలపేట మండలం ఎస్‌బిఆర్‌పురానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ బాబు, విజయశాంతిల కుమార్తెలు మూషిక, చరిత, రిషికలు స్థానిక శివాలయంలో పూజ కోసం వెళ్లి ప్రమాద వశాత్తు చెరువులో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి ఆర్‌కె రోజా చిన్నారుల మృతదేహాలకు పుష్పాలతో నివాళులర్పించారు. బాధిత తల్లి దండ్రులు బాబు, విజయ దంపతులను పరామ ర్శించారు. బాబు కుటుంబా నికి అండగా ఉంటా మని, ఆర్థికంగా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా బాధిత కుటుం బానికి ఆర్థిక సాయం అందించడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. ముగ్గురు చిన్నారుల మృతితో మంత్రి ఆర్‌కేరోజా చలించిపోయారు. శోక సంద్రమైన ప్రజలను చూసి మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలో ఎవరికీ ఇలాంటి క్షోభ కలగ కూడ దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జననీ సురక్ష యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: '

1ooజననీ సురక్ష యోజన'ను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు, డాక్టర్ దివాకర్ పేర్కొన్నారు. వెయ్యి రూపాయలు ఈ పథకం ద్వారా వారి అకౌంట్లో జమ చేస్తారని తెలిపారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం చేసుకుంటే జననీ సురక్ష యోజ న ద్వారా వెయ్యి రూపాయలు వారికి అందిస్తామన్నారు. ఆరోగ్య ఆసరా కింద మరికొంత మొత్తం వారికి జమ చేస్తారని తెలిపారు. ప్రతి నెలా 9వ తేదీ బుచ్చినాయుడు కండ్రిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పరీక్ష చేస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జననీ సురక్ష యోజనపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయొద్దు: ఈసీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బాటిళ్లలో పెట్రోలు, డీజిల్ పోయొద్దని పెట్రోలు బంకుల యజమానులకు మండల ఎన్నికల అధికారి ఎంపిడివో ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో బాటిళ్లలో పెట్రోలు, డీజిలు పోయొద్దని పెట్రోల్ బంక్ నిర్వాహకులను ఈసీ ఆదేశించిందని, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాహనాల్లో మాత్రమే ఇంధనం నింపాలని స్పష్టం చేసిందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయిల్ బంకుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించిందని తెలిపారు. ఈ మేరకు అన్ని బంకుల యజమానులకు నోటీసులు పంపామని తెలిపారు. పోలింగ్ తర్వాత రాష్ట్రంలో పలుచోట్ల హింసాత్మక ఘర్షణల నేపథ్యంలో ఇసి ఈ ఆంక్షలు విధించినట్లు తెలుస్తోందని, పెట్రోలు బంకుల యజమానులు నిబంధనలు పాటించాలని కోరారు. ఈ నెల 21వ తేదీ నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశానికి పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, సింగిల్ విండో అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. ఎవరికీ మినహాయింపు లేదని తెలిపారు. అందరూ హాజరు కావాలని కోరారు.

బాటిళ్లలో పెట్రోలు, డీజిలు పోస్తున్న పెట్రోలు బంకుల యజమానులు

అసంబద్ధ ఆరోపణలు వద్దు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు:

టిడిపికి నష్టం చేకూర్చే పనులు ఎవరో ఏదో చేశారని అసంబద్ధ ఆరోపణలు వద్దని, అదే పనిగా సాక్షి మీడియా తమ వారిని రెచ్చగొడుతోందని వారి ట్రాప్ లో పడి ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడం తాను చూడలేనని సత్యవేడు ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి కోనేటి ఆదిమూలం తీవ్ర స్థాయిలో మనో వేదనను వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏడు మండలాలకు చెందిన ప్రధాన నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపితో పాటు కూటమి నేతలు సమిష్టి కృషితో ఎన్నికల్లో పనిచేశారని, మంచి మెజార్టీతో గెలుస్తున్నామన్నారు. సాక్షి మీడియా రాస్తున్న వక్రీకరణ రాతలు చూసి అపోహలు పడవద్దని, సమన్వయం పాటించాలని సూచించారు. ఎవరైనా తప్పు చేస్తే వారి విజ్ఞతకే వదిలేద్దామని, దానిపై పత్రికలకు ఎక్కడం, సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారంగా ఆరోపణలు చేయడం మన పార్టీ నైజం కాదన్నారు. టిడిపి క్రమశిక్షణ గల పార్టీ అని పేర్కొన్నారు. ఏదైనా అభిప్రాయ భేదాలు, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్క రి స్తానన్నారు. ఓ మంత్రి కుప్పంతో స హా అన్ని తామే గెలు స్తు న్నామని చెప్ప డం హాస్యాస్ప దమని ఆయన కుటుంబంలో ఎవరూ గెలవరన్నారు. జూన్ 4 తర్వాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయి అభివృద్ధి సంక్షేమంతో పాటు ఐదేళ్లపాటు కష్టనష్టాలను ఎదుర్కొన్న పార్టీ శ్రేణులను ఆదుకుంటారని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఆదిమూలంను శాలువాతో సన్మానించి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇళంగోవన్ రెడ్డి, నాయకులు వాణిజ్య విభాగ అధ్యక్షుడు బాలరాజు, ప్రవీణ్ కుమార్ రెడ్డి, బాష, పద్దు రాజు, నెల్సన్ మండేలా, చిన్న, వాసు, రవి, వాసు, వి నాగరాజు, ఢిల్లి పాల్గొన్నారు.

ఆదిమూలంను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

జగదీష్‌ను పరామర్శించిన పులివర్తి వినిల్

ప్రజాశక్తి - రామచంద్రా పురం:

ఈ నెల 14వ తేదీ పులివర్తి నానిపై దాడి సందర్భంగా చోటు చేసు కున్న సంఘటనతో పోలీసులు ఆ ప్రాంతంలో లాఠీఛార్జి చేయడంతో రామచంద్రాపురం మండలం కమ్మ కండ్రిగ పంచాయ తీకి చెందిన జగదీష్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పులివర్తి నాని తనయుడు పులివర్తి వినిల్ శనివారం కమ్మకండ్రిగ గ్రామానికి చేరుకుని జగదీష్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని కోరాడు. ఈ కార్యక్రమంలో వినిల్ వెంట పార్టీ సీనియర్ నాయకుడు జనార్ధన్ చౌదరి, వెంకట ప్రసాద్, ధనుంజయ నాయుడు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: తిరుపతి మహిళ యూనివర్సిటీ స్ట్రాంగ్ రూం వద్ద చోటుచేసుకున్న దాడి ఘటనలో గాయపడ్డ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని యర్రావారిపాలెం మండలం కూరపత్తి వారిపల్లి పంచా యతీకి చెందిన టిడిపి నాయకు లు శనివారం నాని నివాసానికి వెళ్లి పరా మర్శించారు. నాని ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అందరూ వచ్చినందుకు నాని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నాయకులు అన్నా సముద్రం మధు, రెడ్డి బాబు, వాసు, శ్రీపతి, సుధాకర్, సుబ్బు, నగేష్, బుజ్జి బాబు, కుమార్, మణి, కృష్ణ పాల్గొన్నారు.

పులివర్తి నానిని పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

క్రైం న్యూస్

వివాహిత అనుమానాస్పద మృతి

- అత్తింటివారే చంపారని మృతురాలి తండ్రి ఫిర్యాదు

అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కావేరి

ప్రజాశక్తి -డక్కిలి: డక్కిలి మండలం వెంబులూరు గ్రామానికి చెందిన వివాహిత పాయసం కావేరి (22) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలు తండ్రి బ్రహ్మయ్య కథనం మేరకు... మోపూర్ రోడ్డు ప్రాంతానికి చెందిన తమ రెండవ కుమార్తె కావేరిని రెండేళ్ల క్రితం వెంబులూరు కి చెందిన శివరాజుకు ఇచ్చి వివాహం చేశామని తెలిపారు. కొంతకాలం వారి కాపురం సజావుగా సాగిందని, అనంతరం శివరాజు, అతని తల్లి దండ్రులు తిరుపాలు, రత్నమ్మ తమ బిడ్డను అదనపు కట్నం కోసం వేధించడం మొదలుపెట్టారని తెలిపారు. అత్తింటి వేధింపులు తట్టుకోలేక పుట్టింటికి వచ్చిన కావేరిని తామే సర్ది చెప్పి కాపురానికి పంపామని తెలిపారు. కొన్ని రోజులుగా శివరాజుకి రెండో వివాహం చేయాలని కావేరిపై వేధింపులు తీవ్రతరం చేశారన్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం తమ కుమార్తె ఉరి వేసుకుని మృతి చెందిందని ఆ గ్రామానికి చెందిన వారు ఫోన్ చేయగా తాము హుటాహుటిన వెంబులూరుకు చేరుకున్నామన్నారు. కావేరి మృత దేహాన్ని ఇంటి వరండాలో ఉంచి శివరాజు ఆయన తల్లిదండ్రులు పరారయ్యారని తెలిపారు. తమ కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని , పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కాగా మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చౌడయ్య తెలిపారు.

తల్లి ప్రేమకు దూరమైన చిన్నారి

కావేరి శివరాజులకు ఏడు నెలల క్రితం కుమార్తె జన్మించింది. తల్లి మరణంతో అభం..శుభం తెలియని ఆ నెలల చిన్నారి తల్లి ప్రేమకు దూరం కావడం స్థానికులను తీవ్ర ఆవేదనకు గురి చేసింది.

గుర్తు తెలియని వాహనంఢీ..వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం పెళ్ల కూరు మండలంలో చోటుచేసు కుంది. పెళ్ల కూరు మండలం లోని చంబడి పాలెం గ్రామం వద్ద 71 జాతీయ రహదారిపై శనివారం రాత్రి కాళహస్తి వైపు నడిచి వెళుతున్న వ్యక్తిని నాయుడుపేట నుండి శ్రీకాళహస్తికి వెళుతున్న కారు వెనుక నుండి ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నెల్లూరు జిల్లా వెంకటేశ్వర పురం భగత్ సింగ్ కాలనీ కి చెందిన ఆలీ షేర్ (45)గా గుర్తించారు. బేలుదారు పనిచేసుకుంటూ ఆ పరిసర ప్రాంతంలో నివసిస్తున్నాడని గుర్తించారు. ఇతనికి భార్య ఇద్దరూ పిల్లలు ఉన్నట్టు సమాచారం. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ శ్రీకాంత్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రిపూట కావడంతో పక్కనే ఉన్న కొంతమంది యువకులు వాహనాన్ని ఆపలేకపోయామని, తెల్లటి చిన్న కారు ప్రమాదానికి గురి చేసి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఈ విషయమై శ్రీకాళహస్తి వైపు ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం తెలిపామని, రేపు ఉదయం సీసీ కెమెరాల సహాయంతో వాహనాన్ని కనిపెడతామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన వ్యక్తి

యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

- మయూరి శ్యామ్ యాదవ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన యాదవ విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ఈనెల 26వ తేదీన నెల్లూరు నగరంలోని అపోలో ఆస్పత్రి ఎదురుగా ఉన్న జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం లో యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహి స్తామని మయూరి శ్యామ్ యాదవ్(బండి శ్యామ్ సుందరరావు) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఫలితాలలో 475, ఆపైన మార్కులు సాధించిన యాదవ విద్యార్థులు వారి మార్కులిస్టును 9948606664, 9705800794 నెంబర్లకు వాట్సప్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు. గూడూరు, నాయుడుపేట వెంకటగిరికి చెందిన యాదవ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత ఖత్నాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఇన్సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన సామూహిక ఉచిత ఖత్నా కార్యక్రమం గూడూరు పట్టణంలోని షాదీ మందిర్‌లో నిర్వహిస్తున్నట్లు ఇన్సాఫ్ కమిటీ సభ్యుడు కాలేషా తెలిపారు. శనివారం గూడూరు పట్టణంలోని షాదీ మందిర్‌లో ఇన్సాఫ్ కమిటీ సభ్యులు కాలేశా మాట్లాడుతూ ముస్లింలకు ఖత్నా చాలా ముఖ్యమైందని అయితే ముస్లింలలో పేదవారు ఈ కార్యక్రమం చేసుకునేందుకు పలు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో గత కొద్ది సంవత్సరాలుగా ఇన్సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ఖత్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 27వ తేదీన వైద్యుల పర్యవేక్షణలో పట్టణంలోని షాదీ మందిర్ లో ఉచిత ఖత్నా నిర్వహిస్తున్నామని ముస్లిం సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు అన్వర్ బాష , శంషాద్దీన్ , ఇబ్రహీం, నయుం, అల్తాఫ్ రఫీ, మహబలి నవాజ్ పాల్గొన్నారు.

ఈ ఎన్నికల్లో కూటమిదే విజయం

- ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి జి గోపీనాథ్



మాట్లాడుతున్న ఐటిడిపి నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఈ ఎన్నికల్లో టిడిపి కూటమి తప్పక విజయం సాధిస్తుందని ఐ టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జి గోపీనాథ్ పేర్కొ న్నారు. పుత్తూరు టిడిపి కార్యా లయం లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఐదేళ్లుగా తాము అనుభవించిన కష్టాలు, కన్నీళ్లకు ఓట్ల రూపంలో బదులు ఇచ్చారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం కరెంటు ఛార్జీలు, బస్సు ఛార్జీలు పెంచి ప్రజలను మోసం చేసిందన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి వస్తే సంక్షేమంతో పాటు అభివృద్ధి చేస్తారని పేర్కొ న్నారు. నగరి నియోజకవర్గం నుంచి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ విజయం సాధిస్తారని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిపి సభ్యులు సింగరాజు సంతోష్, చంద్రశేఖర్ రెడ్డి, ఈశ్వర్ యాదవ్, యుగంధర్ వర్మ, దేవినేని హరీష్, ఎస్ మహేష్, అశోక్ పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తోనే రోగ నిర్ధారణ: డాక్టర్ మాధవి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి) : నేటి వైద్య ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ తోనే రోగ నిర్ధారణ గ్రహించవచ్చని అని ఆంధ్రప్రదేశ్ అల్లైడ్ అండ్ హెల్త్ కేర్ సైన్స్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మాధవి అన్నారు. శనివారం ఏ రంగంపేట లోని మోహన్ బాబు విశ్వ విద్యాలయంలో స్కూల్ ఆఫ్ పారామెడికల్ అలైడ్ హెల్త్ కేర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో అల్లైడ్ హెల్త్ కేర్ సాంకేతిక పురోభివృద్ధి, అనుబంధ ఆరోగ్య శాస్త్రాలపై అంతర్జాతీయ సదస్సును శనివారం నిర్వహిం చారు. ఈ సదస్సును మోహన్ బాబు విశ్వవిద్యాలయ విసి ప్రొఫెసర్ నాగరాజ్ రామ్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మాధవి మాట్లాడుతూ మెడికల్ టెక్నాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీకి చాలా ప్రాముఖ్యత సంతరించుకుందని పేర్కొన్నారు. మోహన్ బాబు విశ్వవిద్యాలయ విసి ప్రొఫెసర్ నాగరాజ్ రామ్ రావు మాట్లాడుతూ వైద్య వ్యవస్థలో ఆరోగ్య సంరక్షణ నిపుణుల ప్రాముఖ్యత చాలా ఉందన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సు లో ఇంటర్నేషనల్ రేడియాల జిస్ట్ డాక్టర్ సంతోష్ బాబు, (సిఎంసి హాస్పిటల్ వేలూరు) కావేరి బిల్రోత్ హాస్పిటల్, కీప్ బయో కెమిస్ట్ డాక్టర్ సెల్వ కుమార్, మెడికల్ టెక్నాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రోగ నిర్ధారణను పెంచడం అనే అంశంపై సుదీర్ఘ చర్చ సాగించారు. ఈ సదస్సుకు దేశం లోని వివిధ విశ్వవిద్యాలయాల, హాస్పిటల్స్ ప్రతినిధులు పాల్గొని తమ పరి శోధనా ప్రతిపాదనలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మోహన్ బాబు విశ్వవిద్యాలయ వివిధ విభాగాధిపతులు, ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు



పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు:: గూడూరు

O.S.NO. 349/2021

Union Bank of India, Main Branch, Guduru
Rep by its Branch Manager ...**Plaintiff**
Vs.
Patra Prasad ... **Defendent**
To
Patra Prasad, S/o. Ankaiah, Residing at Chittigari Bidu, Thippavarapadu Village, Chennu-2, Gudur Mandal, Tirupati District.

పై వాది అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గూడూరు బ్రాంచ్ వారు బాకీ వసూలు నిమిత్తం మీపై దావా O.S.NO. 349/2021 దాఖలు చేసి ఉన్నందున యిందు విషయమై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల 24.06.2024 ఉదయం 10:00గం॥లకు బుద్దున గానీ, వకీలు ద్వారా గానీ, ఈకోర్టులో హాజరై వారితో మనవి చేసుకోవలసినది. లేని యెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానినము చేయుదురని తెలియచేయడమైనది.
వాయిదా: 24.06.2024

ఇట్లు
డి.వెంకటేశ్వరరావు,
వాది తరపు న్యాయవాది, గూడూరు.
సెల్:9866072082